సీతంవలసలో నూతన వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం : మండలం, సీతంవలస గ్రామంలో రాయపురెడ్డి భుజంగ రావు(బుజ్జి) కుటుంబ సభ్యుల ఆశీస్సులతో కనుమ పండుగరోజు సందర్భంగా సీతంవలస గ్రామంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 300 మందికి నూతన వస్త్రాలు పేద ప్రజలకు మగవారికి లుంగీ పంచి, ఆడవారికి చీరలు అందజేశారు. మన సంస్కృతి సాంప్రదాయాలకు సీతంవలస గ్రామాలపై మమకారానికి వ్యవసాయ రైతులకు మనమంతా ఇచ్చే గౌరవానికి ప్రతి కనుమ పండుగ రోజు తెచ్చే సంబరాలతో ప్రతి ఇంట వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల గాజులకు నగదు వితరణ

విశాలాంధ్ర-జలుమూరు : పోగోడు పంచాయతీ కొత్తూరు గ్రామంలో లాలిశెట్టి ప్రభాకర్ రావు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోని సుమారు 50 మంది మహిళలకు సంక్రాంతి సందర్భంగా గాజులు వేసుకునేందుకు కొంత నగదు ఇచ్చే ఇవ్వడం అనవాయితీగా వస్తుంది. ఈ నేపధ్యంలో ప్రతీ పండగవలే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి పండగకు గాజులతో పాటుగా కొంత నగదు ఆయన ఆడపడుచులు అందరికీ అందజేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ సోదరభావంతో కొంత నగదు ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రతి ఏటా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

షర్మిల నియామకం పట్ల హర్షం

విశాలాంధ్ర-మందస : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వై.ఎస్.షర్మిలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి అధ్యక్షులుగా నియామకం పట్ల మందస కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. షర్మిలను పిసిసి అధ్యక్షురాలుగా నియమించిన ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖడ్గే, రాహుల్‌గాంధీ, సోనియా ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం తెలిపిన వారిలో కొర్ల హేమారావు చౌదరి, ఉప్పాడ రాజారావు, దున్న కోటేశ్వరరావు, బలరాజు, దొక్కరి వాసు, మోహనరావు, భగీరధి శెట్టి, శుక్రశెట్టి, ప్రభాకర్ పండా, మెట్టు రమేష్ సాహు, సిమ్మాసాహు, చంద్రయ్య, పోలేటు రుషి, కొర్ల నాగేశ్వరరావు, కొర్ల వెంకటరావు, బొందల వెంకటరమణ, బొంగి రామోజీరావు, బొంగి రమణ, మజ్జి బాబూరావు, సాసుమాన శ్యామసుందర, చొక్కరి గాంగేయ, మధుసూధనరావు, తిర్రి శాంతారావులు ఉన్నారు.

పోలీసుల రక్షణ కోసం దళితుల వినతి

విశాలాంధ్ర-మందస : మండలం సొండిపూడి గ్రామానికి చెందిన దళితులు నివసిస్తున్న కాలనీకి పోలీసుల రక్షణ తక్షణమే కల్పించి అక్కడ బెట్‌పోస్టు ఏర్పాటు చేయాలని మందస మండలం షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు మిస్కా క్రిష్ణయ్య, బి.దినేష్, డి.కిరణ్‌కుమార్, ఎన్.కరుణాకర్‌లు ప్రకటనలో కోరారు. ఈ మేరకు మందస పోలీసు స్టేషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు, జిల్లా ఎస్.పికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కనుమరోజు రాత్రి వెంకటేశ్వరస్వామి ఊరేగింపులో పాల్గొన్న దళిత యువకులను గ్రామంలోని అగ్రకులాల పెత్తందారుల బెధిరించారని, కుల వివక్షతకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దళిత యువకులను చంపుతామని బెధిరిస్తున్నారని, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించినా ఖాతరు చేయడంలేదని వారు పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం దళితులకు న్యాయం చేయాలని కోరారు.

మండలంలో సచివాలయాలు ప్రారంభం

విశాలాంధ్ర-సోంపేట : మండలంలోని కర్తలపాలేం, పాత్రకొండ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ఎమ్మెల్సీ నర్తురామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డా. నిమ్మనదాసులు కలిసిన ప్రారంభించారు. జగతి కేసుపురం గ్రామంలో రూ.2.50లక్షల నిధులతో జగ్గు నాయుడు చెరువు వద్ద స్నానముల వాటికను ప్రారంభించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ పరిపాలనను ముఖ్యమంత్రి జగన్ గ్రామస్థాయికి విస్తరించి ఒక్కొక్క గ్రామంలో లక్షలాది రూపాయిల వ్యయంతో సచివాలయ భవనాలను, రైతుభరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను నిర్మించిన ఆదర్శ వాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, రౌతు విశ్వనాధం, సిలగాన భాస్కరరావు, సర్పంచ్ పొందూరు గున్నయ్య, ఖగేశ్వరరావు, ఎంపీటీసీలు ఎ.నాగేశ్వరరావు, మంగి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగాస్వామ్యంతోనే పల్లెలు అభివృద్ధి : అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రజాభాగాస్వామ్యంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని అసిస్టెంట్ కలెక్టర్ రఘువేంద్ర మీనా అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందింరలో రెండురోజులు పాటు జరిగిన జీపీడీపీపై మండలస్థాయి శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయితే రెండువారాలు పాటు ఈ ఎంపీడీవో విధులను తెలుసుకొనేందుకు ఇక్కడకు రావటం జరిగిందని ఆయన తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక బడ్జెట్లును తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కల్పన, ఆర్థిక ప్రణాళిక, తదితర కమిటీలు ద్వారా గ్రామ సభలు ఏర్పాటు చేసి పల్లెలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. 2024-25 సంవత్సరానికి సంబందించి గ్రామ స్థాయిలో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని కార్యదర్శి ఆద్వర్యంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. గ్రామ సభలు అయిపోయినప్పటికీ ఈనెల 31వ తేదీ వరకు మిగిలిన అంశాలన్ని పూర్తి చేయాలని ఆయన తెలిపారు. శిక్షణ పొందుతున్న సచివాలయ సిబ్బందిని పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ముఖ్యంగా జీపీడీపీ విషయమై సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన కోరారు. అంతకుముందు ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు దుస్సాలువ కప్పి

ఘనంగా సత్క రించారు. అలాగే ఎంపీడీవో ఎఫ్ఏసీ బి.రామారావు, కార్యాలయ ఏవో సంపతిరావు రాజేశ్వరమ్మ, కార్యదర్శులు ఎన్.ఎన్. చైతన్య, బి. నరేష్‌లకు మండల ప్రొఫైల్, సచివాలయ సంఖ్య తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల విప్ బొద్దు అప్పన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ బొద్దు వెంకటరమణ, చిట్టివలస సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ, పేడాడ వెంకటరావు తదితరులు ఉన్నారు.

అమ్మిందే... తాగండి

ఇదీ పలాస కాశీబుగ్గలో మద్యం దుఖాణాల తీరు..!

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన మద్యం ప్రియులు చుక్కలు చూస్తున్నారు. వారి జేబులు ఖాళీ అవుతున్నా ఇష్టమైన బ్రాండ్‌లు దొరక్క ప్రభుత్వ మద్యం దుఖాణాల్లో విక్రయిస్తున్న ఖరీదైన బ్రాండ్‌లు కొనుగోలు చేసేందుకు నానా పాట్లు పడుతున్నారు. మీడియం, చీప్ లిక్కర్‌వంటి మద్యంబాటిళ్ల విక్రయాలకు ప్రభుత్వ మద్యం దుఖాణాల్లో లేకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని మద్యం ప్రియులు వాపోతున్నారు. రోజంతా కూలీ పనులుచేసి, సాయంత్రానికి మద్యం సేవించి ఉపశమనం పొందుతామనే భావనలో ఉన్న మద్యం ప్రియులకు వారికి అవసరమైన బ్రాండ్‌లు దొరక్కపోవడంతో పొరుగున ఉన్న ఒరిస్సా మద్యానికి లేదా నాటుసారా వైపు పరుగులు పెట్టాల్సిందే. లేదంటే ఖరీదైన బ్రాండ్‌లు తాగాలంటే కూలీ దబ్బులంతా సర్కార్‌కి ఇవ్వాల్సిందే నని వాపోతున్నారు. అసలే సంక్రాంతి, కనుమ, ముక్కనుమ సీజన్ కావడంతో మద్యం షాపులకు భలే గిరాకీ ఉంటుంది. సామాన్య, మద్యతరగతి వర్గాలకు చెందిన మద్యం ప్రియులకు మీడియం బ్రాండ్ లిక్కర్ దొరకడం లేదు. బార్లలో కొనాలంటే జేబులు ఖాళీ అవుతున్నాయి. దీంతో వీరికి ఉన్నది రెండే రెండు చాన్స్‌లు ఒకటి మద్యం షాపుల్లో దొరుకుతున్న ఖరీదైన సర్కార్ మద్యం త్రాగడం, లేకుంటే పది కిలోమీటర్లు దూరంలో ఉన్న ఒరిస్సా రాష్ట్ర నుంచి అనధికారికంగా తీసుకొస్తున్న లిక్కర్‌ను కొనుగోలు చేసుకోవడం లేదా నాటుసారాకు అలవాటు పడడమే గత్యంతరమని పలువురు మద్యం ప్రియులు వాపోతున్నారు. మద్యం షాపుల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సిబ్బంది మాత్రం మెజార్టీ వినియోగదారులు అడుతున్న మీడియం బ్రాండ్‌లు, చీప్ లిక్కర్ వంటివి సరఫరా చేయాలని కోరుతున్నప్పటికీ ఎపి బ్రవరీజీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ప్రభుత్వం సప్లయి చేసే సరుకును మాత్రమే విక్రయించాలి తప్పా మీడియం బ్రాండ్‌లు, చీప్ లిక్కర్ మద్యం అడిగే హక్కులు లేవని సిబ్బందికి ఆదేశిస్తున్నారు. పలాస ప్రాంతంలో అధికంగా మాన్సన్ హౌస్ బ్రాంది, ఇంపిరీయల్ బ్లూ, ఎసి ప్రీమియం, అఫీసర్ చాయిస్ వంటి మీడియం బ్రాండ్‌లకు అధికంగా గిరాకీ ఉంటుంది. కానీ వాటికి బదులుగా రాయల్

స్టాగ్, సిగ్నేచర్, ఎమ్.సి ప్లాటినమ్ వంటి ఖరీదైన బ్రాండ్‌లు అమ్మకం చేస్తుండడంతో కూలీ చేసిన డబ్బుంతా మద్యం షాపులకే ఇచ్చేస్తున్నారు. కంపెనీ యజమానులు ప్రభుత్వ పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటే ఆయా లిక్కర్ బ్రాండ్‌లకు సంబందించిన వాటికి విక్రయించేందుకు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తాయి. అలా కాకుండా ఇదే పరిస్థితి కొనసాగితే పొరుగున కూత వేటు దూరంలో ఉన్న ఒరిస్సా నుంచి మీడియం బ్రాండ్‌లను అనధికారికంగా తీసుకొచ్చే పరిస్థితులు ఏర్పడుతాయి. ఇందులో అనేక రకాల కల్తీ జరిగే అవకాశాలుంటాయి. దీనిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మీడియం బ్రాండ్ లిక్కర్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

అమరావతిలో 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

జిల్లా నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని విక్టర్ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా నలు మూలల నుండి ప్రజలంతా తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఏర్పాటుచేసిన విశ్వజ్ఞాని, భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్మించినట్లు వివరించారు. విజయవాడలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వహణపై బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2వేల కోట్ల రూపాయల

విలువ గల భూమిలో 125 అడుగుల ఎత్తు కలిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని 400 కోట్ల రూపాయలతో నిర్మించినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ స్మృతి వనం, లైబ్రరీ, పచ్చిదనం, ఫౌంటైన్, ధ్యాన మందిరం, తదితరమైనవి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అంబేద్కర్ ఒక్క ఎస్సీలకే కాదు దేశ ప్రజలందరికి దిక్సూచన్నారు. అందరిని ఆహ్వానించ దానికే శ్రీకాకుళం జిల్లా వచ్చినట్లు తెలిపారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. అద్భుతమైన భారత రాజ్యాంగాన్ని రచించి మనకందించినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ చేసిన కృషి, త్యాగం అనిర్వచనీయమని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమని చెప్పారు. ఇటువంటి మహత్తర కార్యక్రమానికి లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రిన్సిపాల్స్ దేవేందర్ రావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ను జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

వంద రోజులు... 100 మొక్కలు లక్ష్యం

జెసిఐ అధ్యక్షులు బెందాళం వరలక్ష్మి

విశాలాంధ్ర-అరసవల్లి : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వంద రోజుల్లో 100 మొక్కలను నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జెసిఐ అధ్యక్షులు బెందాళం వరలక్ష్మి తెలిపారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ స్మృతి వనంలో బుధవారం జెసిసి శ్రీకాకుళం గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించే చర్యల్లో భాగంగా వందరోజుల పాటు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రకృతి కన్నతల్లి లాంటిదన్నారు. దానిని కాపాడుకోవడం సామాజిక బాధ్యతని చెప్పారు. పర్యావరణాన్ని రక్షించుకుంటేనే భావితరాలకు మనుగడ ఉంటుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. జెసిఐ సెనేటర్ జామి బీమా శంకర్, లైన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారిక ప్రసాద్, జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, మారుతి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. ప్రకృతిని ప్రేమించడం, కలిసి జీవించటం జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లా దకరమైన భవిష్యత్తును అందించడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా, ప్రకృతిలోని అన్ని ప్రాణులను

రక్షించుకోవటం మనందరి బాధ్యత అని చెప్పారు. ప్రకృతి పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉద్యమస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలిశెట్టి మధుబాబు, గ్రీన్ సిటీ అధ్యక్షురాలు మణిశర్మ, సనపల విజయలక్ష్మి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సాసపు జోగినాయుడు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, గణపతి పట్నాయక్, జె సి ఐ సెక్రెటరీ సూర్య, ట్రెజరర్ లక్ష్మణ్, అనీల్, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 25నాటికి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : సార్వత్రిక ఎన్నికలకు గాను జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు, నదుపాయాల కల్పనలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని, ఈనెల 25వ తేదీ నాటికి పెండింగ్లో ఉన్న పనులను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా అధికారులతో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2357 పోలింగ్ కేంద్రాలకు గాను 711 కేంద్రాలలో ఇంకా సంతృప్తకర స్తాయిలో ఏర్పాట్లు లేవని గుర్తించామని పేర్కొన్నారు. ఆయా కేంద్రాలలో ఫర్నిచర్, మంచినీరు, మరుగుదొడ్లు, వికలాంగులకు వీలుగా రాంపులు ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా తదితర అంశాలలో లోటుపాట్లను సరిదిద్దాల్సి ఉందన్నారు. ఈనెల 25వ తేదీలోగా వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల వారిగా చేయాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఎలాంటి కష్టం లేకుండా ఓటు వేసేందుకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల నిర్వహణను అధికారులు క్రమ శిక్షణతో బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులకు విధులను కేటాయించడం జరుగుతుందని, ఈ విధులను నిబంధనల ప్రకారం చేపట్టవలసివుంటుందని అన్నారు. సమావేశంలో డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఐసిడిఎస్ పిడి బి శాంతి శ్రీ, సర్వ శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ రోణంకి జయప్రకాష్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వాహణ చర్యలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాబోయే ఎన్నికల్లో శాంతి బధ్రతల సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి ఘర్షణలు లేకుండా ఉండేలా అన్ని రకాల పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇటీవల బాధ్యతలు చేపట్టిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతు ప్రతీ ఒక్కరు ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. గతంలో ఈ ప్రాంతంలో పని చేసిన అనుభవంతో అందరి సహకారంతో ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. వి.కె.పేట రోడ్డు ట్రాఫిక్ నియంత్రణ పై దృష్టి సారించడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయనతో పాటు పట్టణ ఎస్సై గోవింద్ సమావేశంలో పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణి

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కపాసుకుద్ది గ్రామానికి చెందిన కే మీనా అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన 108 అంబులెన్స్ సిబ్బంది గ్రామానికి చేరుకొని గర్భిణీ మహిళకు ఇచ్చాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తిప్పనపుట్టుగ గ్రామ సమీపంలో పురిటి నొప్పులు అధికమవడంతో 108 సిబ్బంది ఈ ఎం టి, సిహెచ్ కృష్ణారావు, పైలట్ రాజేంద్రప్రసాద్ సుఖ ప్రసావం చేయించారు. మీన పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చి తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి మీనా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు రోల్ అబ్జర్వర్ శ్యామలరావు రాక

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఓటర్ల జాబితా జిల్లా ప్రత్యేక పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ జె శ్యామలరావు నేడు జిల్లాకు రానున్నారని ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆయన జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం కానున్నారని అన్నారు. ఈనెల 22న వెలువడనున్న తుది ఓటర్ల జాబితాకి సంబంధించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడతారని పేర్కొన్నారు.

ఏఎంసీ ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి

విశాలాంధ్ర-రణస్థలం : ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా నియమించబడిన కొత్తకోట్ల లక్ష్మీకి ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నేను మరింత కష్ట పడి పనిచేస్తానని. నాపై నమ్మకంతో నాకు ఈ పదవీ బాధ్యతలు అప్పజెప్పిన పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి కి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వి.రాకేష్ రెడ్డికి, శ్రీకాకుళం డీసీసీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావుకి కృతజ్ఞతలు తెల్పువుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కె.జోగినాయుడు, ఆబోతుల జగదీష్‌నాయుడు, మీసాల. గణేష్, మహంతి భాస్కరరావు, ఎం.రమణ, చింతంనాయుడు, సంతు, శాంతి, పవన్, గణేష్, మధు, మోహన్, వై.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం : ఏపీ ఎన్జీవో సహాధ్యక్షులు చౌదరి

విశాలాంధ్ర-ఆమదాలవలస : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏపీ ఎన్జీవో సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తమ నాయుడు అన్నారు. కొనుగుల వలస గ్రామం లో డిసిసిబి మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి రామ జోగినాయుడు శత జయంతి వేడుకలు కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని పురుషోత్తమ నాయుడు ప్రారంభించారు. శిబిరంలో పలువురు మహిళలు రక్తదానం చేయడం విశేషం. గ్రామం నలుమూల లా మొక్కలు నాటారు. సామాజిక కార్యక్రమాల నిర్వహణ అభి నందనీయ మని డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణ రావు అన్నారు. శత జయంతి వేడుకల్లో భాగంగా రామ జోగినాయుడు కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు సుమారు 200 మంది సకుటుంబ సపరివార సమేతంగా ఆత్మీయంగా కలిశారు. ఈ కార్య క్రమంలో చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ, చౌదరి సత్యం, చౌదరి రవీంద్ర, బగాది రాజ గోపాలరావు బొడ్డేపల్లి అనిల్, నిరంజన్, నితిన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

23ఏళ్ల తర్వాత వివేకవర్ధని స్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించిన నాడే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వివేకవర్ధని స్కూల్ పూర్వ విద్యార్థులు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో బుధవారం పిఎన్ కాలనీలో గల వివేకవర్ధని పాఠశాల 2000-01 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 23 సంవత్సరాలు తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు పలకరించుకుంటూ గత స్మృతులను చెబుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆనాడు విద్యను అభ్యసించిన రోజులను గుర్తు చేసుకుంటూ ఉదయం నుండి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆనాటి విద్యకు నేటి విద్యకు ఎంతో వ్యత్యాసం ఉందని, విలువలతో కూడిన విద్యను నేటితరం పిల్లలకు అందివ్వడం లేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే విద్యాబుద్ధులు నేర్పిస్తున్న గురువులే కాకుండా తల్లిదండ్రులంతా తమ పిల్లలకు విలువల పట్ల అవగాహన కలిగించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తామంతా ప్రతి ఏడాది ఇటువంటి ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహమూర్తి, శివ, డాక్టర్ రఘు, ఆనంద్, రాజమోహన్, స్వాతి, మాలతి, ప్రణీత, లీలారాణి, అమరావతి, కళ్యాణి, గణపతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవధానికి గణితమిత్ర అవార్డు

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వందలాదిగా గణిత అవధాన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రముఖ అవధాని కంచిలి మండలం, బూరగాం గ్రామానికి చెందిన మద్దు తిరుపతిరావు మాస్టారుకు ప్రముఖ సేవా సంస్థ జాగృతి స్వచ్ఛంధ సంస్థ గణిత మిత్ర అవార్డును ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి, అవధాని తిరుపతిరావును ఘనంగా సత్కరించి ఈ అవార్డును అందజేశారు. తన అవధానంతో విశేషంగా అకట్టుకుంటూ వేలాది మంది విద్యార్థులలో గణిత పట్ల భయాన్ని తొలగిస్తూ విలువైన చిట్కాల ద్వారా గణిత సమస్యలకు పరిష్కారాలు చెబుతూ అందరిచేత ప్రశంసలు అందుకుంటున్న తిరుపతిరావు మాస్టారు ఎంతో మందికి ఆదర్శమని కొనియాడారు. ఆయన అవధానం దేశం నలుమూలల విస్తరించాలని, మరెంతో మంది విద్యార్థులకు అవధాని సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ సభ్యులు, కొర్లాం గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి నాన్ మెడలిస్ట్ బ్యాడ్మింటన్ విజేత కవిటి

విశాలాంధ్ర-కవిటి : ఈనెల 14 నుండి 16 వరకు సోంపేట మండలం జింకిభద్రలో జరిగిన జిల్లా స్థాయి నాన్‌మెడలిస్ట్ బ్యాడ్మింటన్ పోటీల్లో కవిటికి చెందిన బెందాళం మణికంఠ, తేలుకల అజయ్ (ప్రధమ స్థానం) అలాగే మొగలిపురి దినేష్,బెనర్జీ (ద్వితీయ స్థానం) బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ ఉపాధ్యక్షులు తమరాల జయరామ్, ఉషోదయ గౌరవాధ్యక్షులు బెందాళం చిట్టిబాబు, అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ లోల్ల రాజేష్, ఉపాధ్యక్షులు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధుబాబు, ఉషోదయ మాజీ అధ్యక్షులు పోల్లాయి లక్ష్మణ్ మూర్తి,ఆరంగి రాజు, బెందాలం రంగారావు, కార్యదర్శి పులకల వెంకట్రావు, జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్ తుంగాన శరత్, రాష్ట్ర అంపైర్ జన్ని భరత్, సీనియర్ క్రీడాకారులు రవి, జయప్రకాష్, ప్రసాద్, విశ్వనాథం, దిలీప్, ఉమా మహేష్, మదన్, సోమేశ్‌లు అభినందనలు తెలియజేశారు.

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

డిఆర్ఓ ఎం గణపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన నుంచి గత డిసెంబర్ 9 వరకు వచ్చిన క్లైముల పరిశీలన పూర్తయిందని, ఈనెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు తెలిపారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. బుధవారం డిఆర్ఓ ఛాంబర్ వద్ద గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 28వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ డిసెంబర్ 9 వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామన్నారు. వాటితో సంబంధం లేకుండా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దరఖాస్తు చేసుకునే వారి మార్పులు చేర్పుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ప్రాముఖ్యమైనదని ఓటు విలువ తెలియజేసి పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బిజెపి నుంచి పి సురేష్ బాబు, వైయస్సార్‌సిపి నుంచి ఎస్ సత్యనారాయణ, టిడిపి నుంచి కెవి రామరాజు, బీఎస్పీ నుంచి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉంచాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాబోయే సాధారణ ఎన్నికల నేపధ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో తగిన సదుపాయాలు ఉండేలా చూడాలని ఆర్డీఓ భరత్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయంలో తహశిల్దార్ గురుప్రసాద్, ఎన్నికల ఉప తహశిల్దార్ శ్రీహరిలతో కలిసి ఇతర కార్యానిర్వాహక అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు 299పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడే పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, నీటి ఏర్పాట్లు తదితర మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చేపట్టాల్సిన చర్యలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

షర్మిల నియామకం పట్ల డా.దువ్వాడ హర్షం



విశాలాంధ్ర-పలాస : ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండటానికి కారణం యుపిఎ హయాంలో తెలంగాణ ఏర్పాటు కారణమని భావించారని అయితే అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులే కారణమని పలాస నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలిగా షర్మిలను కాంగ్రెస్ అధిష్టానం నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం జై ఆంధ్రా ఉద్యమంతో రాష్ట్రంలో కాంగ్రెస్, సిపిఎం తప్ప మిగిలిన అన్ని పార్టీలు రాష్ట్రాన్ని విడదీయమని పదేపదే లేఖలు ఇవ్వడం వలన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనకు అంగీకారం తెలిపిందన్నారు. అయితే తమ అధినాయకత్వం కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యతలు ఉండగా పచ్చి అవకాశ వాదంతో అప్పటి నాయకులు చల్లాచెదురై పార్టీలు ఫిరాయించే నాటి కాంగ్రెస్ నాయకుల వలన ఎవరైతే విభజించమని లేఖలు ఇచ్చారో వారే విభజన తర్వాత చేసిన అసత్య ప్రచారాలు అభూత కల్పనలను ఖండించడం లేదా అడ్డుకునే నాయకుడే కాంగ్రెస్ పార్టీలో కరువు అవడం వలన వారు చేసిన అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మి కాంగ్రెస్‌ను దూరం చేసుకున్నారని అన్నారు. 2014లో విభజన సమయంలో ఏయే సమస్యలు ఉన్నాయో అవే సమస్యలు ఇటు బిజెపి గాని ఇటు వైసీపీ, టీడీపీలు గాని పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఈ తరుణంలో మళ్లీ ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలోపేతం కావడానికి ఆస్కారముందన్నారు. 1969 తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యమం మొదలైందని, ఇప్పుడు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావాలని 1972లో జై ఆంధ్రా ఉద్యమం మొదలైందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది, జై ఆంధ్రా ఉద్యమంలో 87 మంది ఆసువులు బాసారన్నారు. ఎప్పుడో సమసిపోయిన అందరు మర్చిపోయిన తెలంగాణ ఉద్యమానికి ఒక ఓటు రెండు రాష్ట్రాలు అంటూ కాకినాడ డిక్లరేషన్ ద్వారా బిజెపి తెర మీదకు తీసుకొచ్చారని, 1999లో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఏజెండాను కాకుండా తమతమ వ్యక్తిగత ఏజెండాతో కొంతమంది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా తెలంగాణ అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చారన్నారు. తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో మంత్రి పదవీ పోయి కాచుకున్న ఉన్న ప్రస్తుత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇదొక ప్రధాన అస్త్రమై దొరికిందని. కేసీఆర్ విభజన వాదంతో పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడున్న ప్రధాన పార్టీల్లో తెలుగుదేశం, వైసీపీ రాష్ట్రంను విడగొట్టమని లేఖలిచ్చాయని, రాజ్యాంగంలో గల ఆర్టికల్ 3 ద్వారా రాష్ట్రాన్ని విడగొట్టమని వైసీపీ చెప్పిందన్నారు. టీడీపీ ఒకసారి కాకుండా రెండుసార్లు మేము లేఖలిచ్చాము విడగొట్టదని చెప్పారని అన్నారు. బాధ్యాయుతమైన స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని వివిధ పార్టీల అభ్యర్ధన మేరకు వందల మంది తెలంగాణ యువకులు ఆత్మహుతుల సంఘటనలకు స్పందించి కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర విభజనకు అంగీకరించిందన్నారు. విడగొట్టమని లేఖలిచ్చిన వైసీపీ, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు తెలంగాణ మా వలనే వచ్చిందని చెప్పారని, అవే పార్టీలు ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ విడగొట్టి చెడగొట్టిందని ప్రచారం చేశారని అన్నారు. ఈ రెండు పార్టీలు తమ అవకాశ వాదాన్ని దిగజారుడు తనాన్ని చాటుకున్నాయని, అంతవరకు కేంద్ర, రాష్ట్రాల్లో పదవులు అనుభవించిన నాటి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ అధినాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి చెప్పడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టీడీపీ వైసీపీలు గత పదేళ్లుల్లో తమ వ్యక్తిగత అవసరాలకే ప్రాధాన్యత ఇచ్చారని, తిరిగి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్న రాష్ట్రానికి విభజన హామీలు అమలు జరగాలన్నా కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వలనే సాధ్య పడుతుందన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-మందస : మండలం కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బడియా కామరాజు, మందస ఎంఇవో-2 మర్రిపాటి భాస్కరరావులు ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి ఉత్సవాలు, సాంస్కృతిక, సాంప్రదాయాల గురించి వివరించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సేనాపతి మురళీ, గవ్వ భీమారావు, సేనాపతి ఈశ్వరరావు, అశోక్ పాణిగ్రాహి, అన్నెపు సుధాకర్, కార్తికేశ్వర చౌదరి, దివాకర్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల సన్మాన కార్యక్రమం

విశాలాంధ్ర-జలుమూరు : విశ్రాంత సైనికుల సన్మాన కార్యక్రమాన్ని చేయూత గ్రూప్ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలకు, స్నేహితులకు చేయూత గ్రూప్ సభ్యులు, అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యక్రమం మనమందరము కలిసి గ్రామ అభివృద్ధిలో పాల్గొనాలని అన్నారు. అలాగే మన తల్లితో సమానమైన శ్రీముఖలింగం గ్రామానికి ఇంకెంతో సేవ చేయడానికి మనము రుణపడి ఉన్నాము కాబట్టి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని గ్రూపు సభ్యులు కోరారు. తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు.

టిడిపిలోకి క్యూకడుతున్న వైకాపా నాయకులు

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో కండువ వేసుకుంటున్న వైకాపా నాయకులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయుడు, వార్డు మెంబర్లు, గ్రామవలంటీర్లు టిడిపిలోకి చేరి పార్టీ కండువేసుకొని అచ్చెన్నాయుడు నాయ కత్వంలో పనిచేయటానికి సిద్ధమవుతున్నారు. నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలం లఖందిడ్డి పంచాయతీ మూలపేట గ్రామం నుండి వైసీపీ వార్డుమెంబరు మూల సింహాచలం, బమ్మిడి ఉత్తరరావు, బమ్మిడి కృష్ణ, మూల చలపతి,మూల త్రినాధరావు, మూల మోహన్‌రావు, ధవళ బాలకృష్ణ, మూల సింహాచలం, మూల వెంకన్న, పైల లక్ష్మణ రావు, మూల గోవిందరావు, బమ్మిడి అమ్మన్నాయుడు, గురువెల్లి మధుసూదన, మట్ట రమేష్, మూల రమణమూర్తి, మట్ట శ్రీరాములు, కర్రి బాలకృష్ణ, మూల మురళి, మూల తిరుపతి, యండ కృష్ణ, కర్రి హరి, రామకృష్ణలతో పాటు సుమారు 50 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. అలాగే కొత్తపల్లి పంచాయతీ నుండి వైసీపీ వార్డు మెంబెర్ వెలమల వెంకటరావు, కొత్తపల్లి గ్రామ వాలంటీర్ వాన ప్రవీణ్‌లు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు అభివృద్ధి తప్ప వైకాపా చేసిందేం లేదని అందుకే అచ్చెన్న చెంత చేరుతున్నామని తెలిపారు. సందిగాం మండలం కాపుతెంబూరు పంచాయతీ నుండి మాలపల్లి సింహాచలం, మాలపల్లి గంగాధర్‌రావు, మాలపల్లి అప్పలరాజు, పోలాకి తిరుపతిరావు, కుమ్మరి కాళిదాసు, కుమ్మరి పోలయ్య, కుమ్మరి పెంటయ్య, మాలపల్లి నారాయణరావు, మలగాం లక్ష్మీ నారాయణ, మాలపల్లి లక్ష్మణరావు, మాలపల్లి తేజస్వరరావు, కుమ్మరి తిమ్మయ్య, మాలపల్లి దాసు, మాలపల్లి వెంకట్రావు మాలపల్లి రామన్న,సత్రాపు ఎండువాడు, కుమ్మరి కాంతయ్య, దుంకార కృష్ణారావు, కుమ్మరి అప్పన్న, కుమ్మరి వెంకట్రావు సుమారు 40 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువ వేసి పార్టీలోకి సాధారణంగా అచ్చెన్నాయుడు ఆహ్వానించారు.

ఆలయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-రణస్థలం : కమ్మ సిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు మూడురోజులు జరగనుందని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వర రావు అన్నారు. మండలంలోని కమ్మ సిగడాం లోని మహాలక్ష్మి తల్లి కమ్మవారి కళ్యాణ మండపం లో సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా జాతర సక్రమంగా జరిపించేం దుకు జాతర మేనేజ్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఎవరు ఏపనులు చెయ్యాలి, కల్చరల్ ప్రోగ్రాం, జాతర అభివృద్ధి తదితర పలు అంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ వి.రాజరవిచంద్ర, వి.తేజ, వి.రాజశేఖర్, రాయుడు, మన్నె లక్ష్మి ప్రసాద్, వెలిచేటి మురళీ, సిహెచ్.వి.రాజేష్, మన్నె కృష్ణా నందం, తాతీయులు, వి.జె.ఎస్. ఎల్.పి.మౌళి, మన్నె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతలక్ష్మీపురంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నాలుగేళ్లగా పల్లె పలకరిస్తుంది పేరిట కార్యక్రమాలు

విశాలాంధ్ర-పోలాకి : మండలంలోని సంత లక్ష్మీపురం గ్రామంలో గత నాలుగేళ్లగా పల్లె పలకరిస్తోంది పేరిట సంక్రాంతి సంబరాలను సర్పంచ్ యారబాటి. నీలవేణి రమణ ఆధ్వర్యంలో ఉత్సాహబరిత వాతావరణంలో ఘనంగా జరుగు తున్నాయి. ఈ ఏడాది కూడా భోగి, సంక్రాంతి రోజుల్లో పిల్లలకు, యువకులకు, మహిళలకు పెద్దవారికి కబడ్డీ, ఉట్టికొట్టడం, వ్యాయామ బలప్రదర్శన, కోడి పందేలు, రంగవల్లులు వంటి పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులంతా ఉత్సాహంగా పాల్గొని పోటీలను సంక్రాంతి సందర్భంగా తిలకించారు. పట్టణాల్లో స్థిరపడ్డ గ్రామవాసులు పల్లె వాతావరణంను చూసి మురిసిపోయారు. సంక్రాంతి అంటేనే కొత్త దాన్య రాశులు, నూతన వస్త్రాలు, కొత్తఅల్లుళ్లు, కోడిపందేలు, పాడి పశు వులు గుర్తొస్తాయి. ఈ నేథ్యంలోనే ఆ గ్రామం గత కొన్నేళ్లుగా సంక్రాంతి సంబరాలకు కేరాఫ్‌గా మారిందంటే అతిశయోక్తి కాదు. పోలాకి మండలంలోని సంతలక్ష్మీపురంలో సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో పట్నం సాగ సంపుతుంది పల్లె స్వాగతిస్తుంది పేరిట సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. మూడు రోజులు పాటు మద్యం, జూదంలకు దూరంగా ఉంటూ.. ఊరంతా ఒకేచోట చేరి ఆట, పాటలతో సందడి చేశారు. ఉట్టికొట్టడం, వ్యాయామ పోటీలు, కర్ర సాము గరిడీలు, యువత విచిత్ర విన్యాసాలు, అతివలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలు ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులతో సంక్రాంతి శోభను సంతరించుకుంది. కనుమ రోజున గో పూజలు నిర్వహించారు. అలాగే కొంతమంది అతిథులను కూడా సత్కరించారు. వివిధ పోటీలలో విజేతలగా నిలిచిన వారికి సర్పంచ్ యారబాటి. నీలవేణి రమణ, గ్రామ పెద్దలు చేతుల మీదగా బహుమతుల ప్రధానం చేశారు. పట్నం నుంచి స్వగ్రామానికి వచ్చిన బంధువులంతా సంబరాలను ఆస్వాదించారు. ఇంత ఘనంగా జరపడంలో కీలక భూమిక వహించిన యువతీ యువకులను మెచ్చుకొని తమ అభినందనలు వారికి తెలియజేశారు.

టెక్కలిలో ఐసిఐసిఐ బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఐసిఐసిఐ బ్యాంక్ తమ నూతన శాఖను ఏర్పాటు చేసింది. నగరంలో బ్యాంక్‌కి ఇది మొదటి శాఖ కాగా జిల్లాలో ఆరవ శాఖ. ఈ శాఖలో ఏటీఎం-కమ్-క్యాష్ రీసైక్లర్ మెషిన్ (సిఆర్ఎం) ఉంది, ఇది వినియోగదారులకు 24 గంటలూ నగదు డిపాజిట్, ఉపసంహరణ సేవలను అందిస్తుంది. సబ్ కలెక్టర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నూరుల్ క్వమేర్ ఐ.ఎ.ఎస్ ఈశాఖను ప్రారంభించారు. సేవింగ్స్ కరెంట్ ఖాతాలు సహా విస్తృత శ్రేణి ఖాతాలు, ట్రేడ్ మరియు ఫారెక్స్ సేవలు, ఫిక్స్డ్, రికరింగ్ డిపాజిట్లు, రుణాలు-వ్యాపార రుణం, గృహ రుణం, వ్యక్తిగత రుణం, ఆటోలోన్, గోల్డ్‌లోన్‌తో పాటుగా చెల్లింపులు కార్డ్ సేవలతో సహా సమగ్రమైన సేవలను ఐసిఐసిఐ ఈ శాఖ అందిస్తుంది. ఎన్నారై కస్టమర్లకు సైతం బ్యాంకింగ్ సేవలను కూడా ఈ శాఖ అందిస్తుంది. ఇది తమ ప్రాంగణంలో లాకర్ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... మండల కేంద్రం సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003వ సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు బుధ వారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఇదే బ్యాచ్‌లో చదివి అసువులు బాసిన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఉద్యోగాలు రీత్యా వేరు వేరు ప్రదేశాలలో ఉంటున్న ఈ బ్యాచ్‌మీట్స్ అంతా, సంక్రాతికి స్వంత ఊరు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంబరానికి ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు విద్యార్థుల ఆహ్వానం మేరకు హాజరై పూర్వ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఆనాటి విద్యార్థులు అందర్నీ గుర్తుపెట్టుకొని, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించడం చాలా ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు, ఎంఈఓ జలుమూరు చిన్నవాడు, రవి, శ్రీనివాస్, నడుపూరి చిన్నబాబు, పి.మోహనరావు, ధర్మారావు, సాంబమూర్తి, వరలక్ష్మి, ఈశ్వరావు, అప్పటి విద్యా కమిటీ చైర్మన్ కొండాల సోమేశ్వరావు, ఈ అపూర్వ కలియకలో తంగి భాస్కరరావు, పంగ రమేష్, బొమ్మాళి ప్రసాద్, అల్లు సోమేశ్వరావుతో పాటు సుమారుగా 70 మంది విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-పాతపట్నం : పాతపట్నం మండలం పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సర పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో గల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులను నేర్పించి, ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను సన్మానించారు. అలాగే భోగి మంటలను వెలిగించి, సంక్రాంతి సంబరాలను మేళతాళాలతో సాంప్రదాయబద్ధంగా పూర్వ విద్యార్థులందరూ తమ ఉపాధ్యాయులతో కలిసి వైభవంగా జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో, తాము చదువుకున్న రోజుల్ని గుర్తు చెసుకుంటూ ఆట, పాటలతో రోజంతా చాలా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహాయపడేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజేషన్ చేసిన పూర్వ విద్యార్థులు సూరారపు శ్రీనివాసరావు, బెజ్జిపల్లి నిరంజన్, రావాడ క్రిష్ణవేణి, మీల చంద్రవతి, దండుగుల ఫాల్గుణ, బైరి హేమంబర్, పాగోటి రామక్రిష్ణ, ఉప్పు విజయలను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో 117మంది 2000-2001 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న బుడార్సింగిలో ఒడియా కళాకారుల సమ్మేళన్

విశాలాంధ్ర-పలాస : ఆంధ్రప్రదేశ్ ఒడియా కళాకారుల మహా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న మందస మండలం బుడార్సింగిలో ఒడియా కళా సమ్మేళనం నిర్వహిస్తున్నామని రాష్ట్ర బాధ్యులు డాక్టర్.నల్ల తిరుపతి సాహూ,అశోక్ కుమార్ పాణిగ్రాహి,డాక్టర్ కుమార్ నాయక్ తెలిపారు.బుధవారం వారు విలేకరుల తో మాట్లాడుతూ భారత్ వర్ష్ అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ ప్రతిమ ప్రాణ ప్రతిష్ట సందర్భముగా బుడార్సింగి రామ మందిర ఆవరణలో రామ తారక మహా మంత్రం, యజ్ఞము, హెూమం, అధ్యాత్మిక కళా ప్రదర్శనలు, ఆట పాట మాట ఒడియా కళాకారులచే నిర్వహిస్తున్నామని, మూడు వేల మందికి అన్న సమారాధన చేసేందుకు నిశ్చయించామని తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన ఒడియా కళాకారులకు సత్కారాలు, సన్మానాలు చేస్తామని,ఆంధ్రలో నివాసం ఉంటున్న ఒడియా కళాకారులకు ఐడి కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు.ఆధ్యాత్మికత పై ఆసక్తి ఉన్న ఒడియా కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని, పూర్తి వివరాలకు 87905 78177, 6371114628 నంబర్లకు సంప్రదించాలని కుమార్ నాయక్ కోరారు.

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : విద్యారంగం అభివృద్ధి తోనే సమాజ ప్రగతి సాధ్యమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో బుధవారం రాష్ట్ర ఉన్నతి విద్యా మండలి వర్సిటీ సంయుక్తంగా ఏపీ పాఠశాల విద్య సంస్కరణలు ఆవిష్కరణలు మేధోసంపత్తి హక్కులు అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాల సమాజానికి ప్రతిబింబం వంటిదని చెప్పారు. ఎటువంటి అభివృద్ధికైనా విద్య మూలం అన్నారు. పేదరికం, నిరక్షరాస్యత తదితర అంశాలు సమాజాభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నట్లు చెప్పారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం ఎన్ఆర్డిసి సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బి.కె సాహు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంతో సమాజంలో మరిన్ని మార్పులు సంభవిస్తాయని చెప్పారు. విద్య పరిశోధన సంస్థల అధ్యయనాలకు ఎదురయ్యే సవాలను నూతన విద్యా విధానంతో అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య వర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ డాక్టర్ సిహెచ్ రాజశేఖర్‌రావు హానరరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు వివిధ విభాగాల డీన్ ప్రొఫెసర్ పిలా సుజాత డాక్టర్ కే.స్వప్నవాహిని జేఎన్టీయూ పాలకమండల సభ్యులు డాక్టర్ బుడుమూరు రాజేష్ వర్సిటీ ప్లేస్మెంట్ అధికారి కే విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. విసికి సత్కారం: బిఆర్ఏయు విసిగా మూడేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న సందర్భంగా సత్కరించారు కొనియాడారు.

కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-సోంపేట : అంగన్‌వాడీలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ఇప్పటికీ మోక్షం కలుగకపోవడం దురదృష్టకరమని, కోటి సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి జగనన్నకు చెబుదామని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి. ఆరేలమ్మ పేర్కొన్నారు. బుధవారం గ్రామాల్లో అంగన్ వాడీలతో కలిసి సంతకాలు సేకరణలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర ధరలతో సామాన్య మధ్యతరగతికి పెనుభారంగా మారిందని అన్నారు. కనీస వేతనాలను అందించి అన్ని వర్గాలను ఆదుకోవాలని కోరారు. సమ్మె చేపడుతున్న అంగన్‌వాడలను బెదిరించం ఎంత మాత్రం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు పి. రాజేశ్వరి, నాగవేణి, జ్యోతి, వి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురు శిష్యుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-కవిటి : మార్పు శాశ్వతం,కాలానికి అనుగుణంగా నడుచుకోవడం మంచివైపు అడుగులు వేయడం నేర్చుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొరివంకలో జరిగిన 1990-91 పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సంద ర్భంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొరివంకలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేపట్టి ఆనాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు బోధించిన గురువులు పూడి బాలయ్య,కే రమేష్, బందరు ఉమామహేశ్వరరావు, బల్లేడ శంకరరావు, సనపల రామకృష్ణతోపాటు పలువురు ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా సన్మానించి జ్ఞాపకలను అందజేశారు.

ముత్యాలపేటలో... మండలంలోని ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2006-2007 విద్యా సంవత్సరపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అలనాటి ఉపాధ్యాయులు ప్రియా వేణుగోపాలరావు, మొర్రి గోపి, బెందాళం నీలాచలం, శ్రీను,తులసి,హేమారావు,జ్యోతి లను ఆత్మీయంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాల పేట ఉపాధ్యాయులు అనింగి నాగేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు రంగారావు, పాతిస వెంకట్రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తమ జ్ఞాపకాలను చక్కగా పంచుకున్నారు. తమతో చదివి ఇటీవల అనారోగ్యంతో మరణించిన గున్న రాజు కుటుంబానికి పూర్వ విద్యార్థులు 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పాతపట్నంపై అన్న ఎన్టీఆర్ ముద్ర

ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపు
లక్ష్మిపార్వతికి పట్టం కట్టిన పట్నం ప్రజలు

విశాలాంధ్ర-కొత్తూరు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు చెరగని ముద్ర పాతపట్నం నియోజకవర్గంపై విస్తృతంగా ఉందని చెప్పాలి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత ఎనిమిది సార్లు సాధారణ ఎన్నికలు జరగగా ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఆయన సతీమణి లక్ష్మిపార్వతి ఇక్కడే ఎమ్మెల్యే అయ్యారు. 1983లో టిడిపి అభ్యర్థి తోట తులసి దాస్‌నాయుడు 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా టీడీపీ అభ్యర్థి కలమట మోహనరావు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. సాంకేతిక, న్యాయ వివాదాలు కారణంగా 1996లో పాతపట్నంలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో అన్న ఎన్టీఆర్. సతీమణి నందమూరి లక్ష్మీపార్వతి అన్న టీడీపీ ఎల్పి పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. అన్న ఎన్టీఆర్‌పై అభిమానంతో ఆయన సతీమణి లక్ష్మి పార్వతిని పాతపట్నం ప్రజలు గెలిపించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత యన్టీఆర్ ఈప్రాంతంలో పలుసార్లు పర్యటన జరిపితే జనాలు ఆయన్ని చూడడానికి గ్రామాలకు గ్రామాలు ఇల్లు విడిచి రోడ్‌పైకి వచ్చాయి. పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న వంశధార ప్రాజెక్ట్‌లో భాగమైన హిరమండలం రిజర్వాయర్ నిర్మాణానికి 1995 ఆగస్ట్‌లో పునాది రాయి వేశారు. అదేసమయంలో రాజధానిలో దేశం పార్టీలో ఎన్టీఆర్‌పై తిరుగుబాటు అంతర్గత సంక్షోభం జరిగి సీఎం పదవి నుండి తప్పుకున్నారు. ఆనాడు సీఎంగా ఎన్టీఆర్ చివరి అధికార పర్యటన పాతపట్నంతోనే ముగిసింది. అందుకే అన్న యన్టీఆర్ రాజకీయ జీవితానికి పాతపట్నం నియోజకవర్గానికి విడదీయలేని సంబంధం.

హక్కుల కోసం బెంతు ఒరియాల పోరాటం

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రం కవిటిలో తమ హక్కులకోసం పోరాటం చేస్తున్న బెంతు ఒరియాల 21వ రోజు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మాణిక్యపురం పంచాయితీ గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి దేవరాజ్ సాహు మాట్లాడుతూ ఎక్కడో జరిగిన తప్పిదం కారణంగా మా బెంతు ఒరియా సామాజిక వర్గం యొక్క కుల ధృవీకరణ పత్రాలు అకారణంగా నిలిపి వేయుట తీవ్ర అన్యాయమని అన్నారు.తమ పిల్లల విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బృందావన్ దోలయి, సంతోష్ సాహు, ఢిల్లీ మజ్జి, హరికృష్ణ సాహు, కార్తిక్, యువకులు తదితరులు పాల్గొన్నారు.